నేడు రగ్బీ క్రీడాకారుల ఎంపిక

మోపాల్ (ఖలీల్‌వాడి), జూన్ 8 : మోపాల్ మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటలకు రగ్బీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, కార్యదర్శి అబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 2006, 2007, 2008లో పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని జంఖనా గ్రౌండ్‌లో టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఇందల్వాయి, జూన్ 8 : డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం(బీ) గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ప్రేమ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభించలేదు. ధర్మారం(బీ)లోని ఎంఎస్ బార్ వెనుక ఖాళీ స్థలంలో చెట్టు కింద ప్రేమ్‌కుమార్ మృతదేహం గ్రామస్తులకు కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ విఫలం'

ఖలీల్‌వాడి, జూన్ 8 : నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విఫలమైందని, నీట్ పరీక్షను నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు గణేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 4న నీట్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయని, ఈ పరీక్షల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా స్థాయిలో టాప్ ర్యాంకులు వచ్చాయని తెలిపారు. ఈ పరీక్షల ఫలితాలను జూన్ 14న విడుదల చేస్తామని చెప్పి, ఎలక్షన్ ఫలితాల రోజునే విడుదల చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గతంలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులకు మాత్రమే ఉత్తమ ర్యాంకులు వచ్చాయని, ఈ సారి 67 మందికి మొదటి ర్యాంకు ఏ రకంగా వస్తుందని ప్రశ్నించారు. నీట్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర కమిటీ సభ్యులు వేణు, సంతోష్, నాయకులు రాజు, మారుతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్, జూన్ 8 : జిల్లాకేంద్రంలోని ధర్మపురి హిల్స్‌లో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మహ్మద్ బషీరుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 వతరగతిలో 8 సీట్లు, 7వ తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయని, కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాధవనగర్‌లోని శ్రీ మేధా భవనంలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను సొంతభవనంలోకి మార్చినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7995057904 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నేడు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు

పొతంగల్, జూన్ 8 : మండల కేంద్రంలోని బాలాజీ ఆలయ 19వ వార్షికోత్సవాన్ని నేడు (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తామని, హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి ఉత్సవాలకు హాజరవుతారని తెలిపారు.

ఊరూరా 'బడిబాట'

- గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు
- బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఎత్తొండ బడిబాటలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

మోర్తాడ్/ నవీపేట/ ఏర్గట్ల/ బోధన్ / రెంజల్/ కోటగిరి/ చందూర్/ ధర్పల్లి, జూన్ 8: జిల్లాలో ఈ నెల 6న ప్రారంభించిన బడిబాట కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లోనే ప్రైవేట్‌కు దీటుగా విద్యనందిస్తున్నామని, ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నదని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం బడీడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పిస్తున్నారు. ఎలాలవాడలోని మోర్తాడ్ ప్రభుత్వపాఠశాల హెచ్‌ఎం దండు గంగాధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఐదుగురు బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు.

నవీపేట మండలంలోని ఎల్‌కే ఫారం గ్రామంలో మధ్యలో చదువు మానేసి ఇంటి వద్ద ఉన్న ఏడుగురు పిల్లలను బడిబాట కార్యక్రమంలో భాగంగా బడిలో చేర్పించినట్లు ఎంఈవో గణేశ్ రావు తెలిపారు. ఏర్గట్ల మండలంలోని తడ్‌పాకల్‌లో జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జావిద్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు బడిబాటపై అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అవగాహన కల్పించారు.

రెంజల్ మండలంలోని దూపల్లిలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎనిమిది మంది విద్యార్థులు ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ పొందినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు తాళ్ల సోమలింగంగౌడ్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలోని 10 వ వార్డులో ఉన్న గోసంబస్తీ, రెంజల్ మండలంలోని అంబేద్కర్‌నగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. బోధన్ సీడీపీవో జానకమ్మ, సూపర్‌వైజర్ రాధికా రాథోడ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని, ఐదేండ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేండ్లు నిండిన చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విక్టోరియా రాణి, సరోజ, రత్నమ్మ, రెంజల్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి, మాజీ సర్పంచ్ మధురాబాయి, టీచర్ రజిత, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటగిరి మండలంలోని ఎత్తొండ, వల్లభాపూర్, బస్వాపూర్ తదితర గ్రామాల్లో విద్యాశాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పొతంగల్, కోటగిరి సెక్టార్ల సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చందూర్ మండలకేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట చేపట్టారు. 8మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాములు, ఇందిర, మాధవీలత, సీఆర్పీ సాయిలు పాల్గొన్నారు. ధర్పల్లి మండలంలోని సీతాయిపేట్‌లో ఉపాధ్యాయులు గంగారెడ్డి, ప్రసన్న పర్యటించి అవగాహన కల్పించారు.

చందూర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రెంజల్ మండలం దూపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు

ఖలీల్‌వాడి, మే 8 : రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్‌పరంగా ఆరోగ్య సేవలందిస్తున్న దవాఖానలు, క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, ప్రథమ చికిత్స కేంద్రాల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాకేంద్రంలోని ఖలీల్‌వాడిలో ఉన్న పలు ప్రైవేట్ దవాఖానలను డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం దవాఖానలు నడుపుతున్నారా లేదా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన, హెచ్ఈవో సంతోష్, ఆరోగ్య కార్యకర్తలు శ్రీధర్, రఘు ఉన్నారు.

జిల్లాకేంద్రంలోని ఓ దవాఖానను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

స్వగ్రామానికి చేరిన మృతదేహం

రాజశేఖర్ (ఫైల్)

సిరికొండ, జూన్ 8 : మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన గాజనబోయిన రాజశేఖర్ (42) దుబాయ్‌లో 12 రోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బతుకు దెరువు కోసం 15 ఏండ్ల నుంచి దుబాయికి వెళ్లి వస్తూ ఉన్నాడని కుటుంబీకులు తెలిపారు. రాజశేఖర్ మృతదేహం శనివారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకోగా.. అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

ఆకట్టుకున్న భక్తి కవి సమ్మేళనం

కవులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సుభాష్‌నగర్, జూన్ 8 : నగర శివారులోని బోర్గాం లక్ష్మీగణపతి ఆలయంలో ఆధ్యాత్మిక భక్తి కవి సమ్మేళనం శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ వ్యవస్థాపకుడు అరుణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. 28 మంది కవులు కవితా గానం చేశారు. లక్ష్మీ యాగం సందర్భంగా కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గణపతి అశోకశర్మ, కాసర్ల నరేశ్ రావు, చింతల శ్రీనివాస్‌గుప్తా, ప్రవీణ్‌శర్మ, తిరుమల శ్రీనివాస్, కేవీ రమణాచారి, తొగర్ల సురేశ్, చెన్న శంకర్, చంద్రశేఖర్ తదితరులు చేసిన కవితాగానం భక్తిభావాన్ని పెంపొందిచాయి. కవులను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

హోటల్‌లో నిల్వ ఉంచిన పదార్థాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఖలీల్‌వాడి, జూన్ 8 : జిల్లాకేంద్రంలోని పలు హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. నగరంలోని ప్రగతి దవాఖాన వద్ద ఉన్న ప్రముఖ హోటల్‌లో హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. వంట శాలను పరిశీలించి, నిల్వ ఉంచిన మాంసం, పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి వరకు పెద్ద హోటళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టారు.

మారుతీ సుజుకీ నూతన కార్ల ఆవిష్కరణ

కార్ల ఆవిష్కరణలో పాల్గొన్న షోరూం సిబ్బంది, బ్యాంకు అధికారులు

ఖలీల్‌వాడి, జూన్ 8 : జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న వరుణ్ మోటార్స్‌లో మారుతీ సుజుకీ డ్రీమ్ సిరీస్ లిమిటెడ్ ఎడిషన్ కార్లు అయిన ఆల్టో కే-10, సెలోరియా, ఎస్‌ప్రెసో కార్లను ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మహేశ్వర్ శనివారం ఆవిష్కరించారు. అత్యాధునిక టెక్నాలజీతో కార్లు ఉన్నాయని, షోరూం ధర రూ. 4.99 లక్షల నుంచి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రగతిభవన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అరవింద్, వరుణ్ మోటార్స్ జనరల్ మేనేజర్ రమణగుప్తా, అసిస్టెంట్ మేనేజర్ సుమన్, సేల్స్ మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు బస్సుపాస్‌ల జారీ

నందిపేట్, జూన్ 8 : మండల కేంద్రంలోని నందిగుడి వద్ద నందిపేట్, డొంకేశ్వర్ మండలాల దివ్యాంగులకు ఆదివారం ఉదయం 11 గంటలకు బస్సు పాస్ శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ అధికారులు శనివారం తెలిపారు. ఎవరికైనా కొత్తగా బస్సుపాస్ కావాలనుకునేవారు, రెన్యువల్ చేసుకునే వారు రావాలని పేర్కొన్నారు. బస్సు పాసు కావాల్సిన వారు ఆధార్ కార్డు, సదరం జిరాక్స్, ఫొటో తీసుకురావాలని సూచించారు.

15న బోధన్‌లో ఉచిత వైద్య శిబిరం

శక్కర్‌నగర్, జూన్ 8: బోధన్ పట్టణంలోని జాంకార్ దవాఖానలో ఈనెల 15న వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వాసవీ క్లబ్ బోధన్ అధ్యక్షుడు డాక్టర జాంకర్, కార్యదర్శి డాక్టర్ సూర్యారావు సూచించారు.

రామోజీరావుకు నివాళి

రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పి కమ్మ సంఘం నాయకులు

బోధన్/ ఆర్మూర్/ ఖలీల్‌వాడి, జూన్ 8: రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు శనివారం తెల్లవారు జామున మృతి చెందగా జిల్లాకు చెందిన పలువురు నివాళులర్పించారు. బోధన్‌లోని మినార్‌పల్లి క్రాస్‌రోడ్డులోని కమ్మ సంఘంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లంపాటి శివనారాయణ, పీవీ సుబ్బారావు, శ్రీధర్, గాంధీ, పావులూరి వెంకటేశ్వర్ రావు, ఇప్పగంటి రంగారావు, కొండలు పాల్గొన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినట్లు ఆ పార్టీ నాయకులు అంబిక సత్యనారాయణ, వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్మూర్‌లోని ప్రెస్‌క్లబ్ భవన్‌లో రామోజీరావుకు ఘన నివాళులర్పించారు.

చెక్కి చెరువులో చెత్త

తొలగించాలని గంగపుత్రుల వేడుకోలు

బోధన్ పట్టణ శివారులోని చెక్కి చెరువు ఒడ్డున పేరుకుపోయిన చెత్త

శక్కర్‌నగర్, జూన్ 8: బోధన్ పట్టణంలోని బురుడుగల్లీతో పాటు పలు వార్డులకు ఆనుకుని ఉన్న చెక్కి చెరువు చెత్తా చెదారంతో దుర్గంధభరితంగా మారుతోంది. సుమారు వందకు పైగా ఎకరాలకు సాగు అందించే ఈ చెరువు బోధన్ గంగపుత్రులకు చేపల పెంపకం కోసం ఉపయోగపడుతోంది. చెరువులో నీటి మట్టం తగ్గడంతో అలుగు వద్ద చెత్త బయట పడింది. ఈ చెరువు వద్ద పలువురు రాత్రుల్లో మద్యం తాగి ఖాళీ సీసాలను పగులగొట్టి చెరువులో వేస్తున్నారని గంగపుత్రులు ఆరోపించారు. గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు నివేదించామని, జేసీబీ ద్వారా ఈ చెత్తను తొలగించాలని కోరామని గంగపుత్రులు వెల్లడించారు. చెరువు ఆక్రమణకు కూడా గురవుతోందని, ఈ చెరువును పర్యవేక్షించేవారు కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

చెక్కి తలాబ్‌లో చెత్తను తొలగించాలని ఫిర్యాదుగాని, వినతిపత్రాలు అందలేదు. అయినా, ఈ చెరువును గంగపుత్రులతో కలిసి పరిశీలిస్తాం. అవసరమైన మేరకు మున్సిపల్‌శాఖ పరంగా చర్యలు చేపడతాం. సంబంధిత అధికారులకు కూడా నివేదిస్తాం.

- వెంకట నారాయణ,
మున్సిపల్ కమిషనర్, బోధన్

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

విజేత జట్టు నాగంపేట్

ముప్కాల్, జూన్ 8: మండల కేంద్రంలోని మమత నర్సింగ్ హోం 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలు పోటీ తత్వాన్ని పెంచుతాయని అన్నారు. గ్రామ స్థాయిలో ఇలాంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. టోర్నీలో నాగంపేట్ జట్టు ప్రథమ, నల్లూర్ జట్టు ద్వితీయ, తృతీయ స్థానంలో బాల్కొండ జట్టు నిలించాయి. విజేత జట్లకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5వేలు,మూడో బహుమతి వెయ్యి రూపాయల నగదు అందజేశారు. మమతా నర్సింగ్ హోం డాక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, ఎస్సై భాస్కరా చారి, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు నునుగొండ అంజయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కె.గంగాధర్, వీడీసీ చైర్మన్ లింగం, ముస్కు మోహన్, పోల ప్రవీణ్, ఏలేటి రాములు, గోపి, రాము, దినేశ్, రాజుకుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మమతా నర్సింగ్ హోమ్ 44 వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించగా.. 23 మంది యువకులు రక్తదానం చేశారు.

విజేత జట్టు నాగంపేట్ క్రీడాకారులతో నిర్వాహకులు

ఆర్మూర్‌లో లోక్ అదాలత్

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, జూన్ 8: పట్టణంలోని కోర్టు కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా ఆధ్వర్యంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని పేర్కొన్నారు. ప్రతి రెండు లేదా మూడు నెలలకోసారి నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఎస్సైలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

మాక్లూర్, జూన్ 8: మండలంలోని మాక్లూర్, కల్లెడి సహకార సంఘం పరిధిలోని రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఏవో పద్మ తెలిపారు. 30 కిలోల బస్తా సబ్సిడీపై 1,116 రూపాయలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ పట్టాపాస్‌బుక్ జిరాక్స్‌ను తీసుకురావాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ క్లస్టర్ గ్రామాల్లోని రైతులకు విత్తనాల పంపిణీ గురించి తెలియజేయాలని అన్నారు.

మొరం అక్రమ దందాపై ప్రత్యేక దృష్టి

నవీపేట,జూన్ 8: మండలంలో మొరం అక్రమ దందాపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నారాయణ హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా మొరం వ్యాపారం కొనసాగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి మొరం, ఇసుక రవాణా చేస్తే జరిమానాతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇండ్ల నిర్మాణాలతో పాటు ఇతరాత్ర అవసరాలకు అనుమతులు ఇస్తామని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOTS for SALE
Peram
దుండిగల్ ORR ప్రక్కన HMDA, RERA Approval కలిగి ఉన్న మల్లు కట్టుకోవడానికి అనువైన లేఅవుట్ ప్లాట్లు అమ్మకానికి కలవు.
బ్యాంక్ లోన్ సదుపాయం కలదు.
గమనిక: ఈ లేఅవుట్ చుట్టుప్రక్కల గేటెడ్ కమ్యూనిటీ హౌసింగ్, విల్లాస్ ఉన్నవి. మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
Trendz apartments, Gachhibowli
9849 162 168

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"మీరు మార్పుకు" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు కేవలం 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

CHANGE OF NAME
I, KURME RAVI S/o. PEDDA RAJANNA KURME R/o.H.No.4-9/4, Bodepalle, Balkonda, Nizamabad now changed Name/Surname as MEKALA RAVI
NTZ-324893

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేల్పూర్, జూన్ 8 : మండలంలోని సాహెబ్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో 2003-2004లో 5వ తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20 ఏండ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యాబోధన చేసిన గురువులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగం అశోక్, మాణిక్యం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుచెప్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

గ్రామాల్లో మృగశిర కార్తె

మాక్లూర్, జూన్ 8: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మృగశిర కార్తె (మిరుగం) జరుపుకొన్నారు. కొన్ని గ్రామాల్లో శుక్రవారం, మరికొన్ని గ్రామాల్లో శనివారం నిర్వహించుకున్నారు. మృగశిర కార్తె నేపథ్యంలో మండల కేంద్రంతోపాటు మానిక్ బండార్ గ్రామంలో చేపల విక్రయాలు జోరుగా కొనసాగాయి. కిలోకు రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి విక్రయించారు. మామిడిపండ్లనుకు గిరాకీ ఉండడంతో కిలో రూ.60 ఉండగా 120 రూపాయలకు విక్రయించారు. ప్రతి ఒక్కరూ మామిడి పండ్లు ,చేపలను కొనుగోలు చేయడంతో వ్యాపారులు ఇదే అదునుగా భావించి ధరలను ఆమాంతం పెంచేశారు.

చేప మందు పంపిణీ

ఆలూర్, జూన్8: మండలంలోని గుత్ప గ్రామంలో మృగశిర కార్తె సందర్భంగా నర్సయ్య కుటుంబ సభ్యులు శనివారం చేప మందును పంపిణీ చేశారు. గ్రామంలో 60 ఏండ్లుగా చేప మందు పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచాలి

సాటాపూర్‌లో ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ నరేశ్‌కుమార్

రెంజల్, జూన్ 8: రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని బోధన్ రూరల్ సీఐ నరేశ్ కుమార్ ఫర్టిలైజర్ యాజమానులకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. లైసెన్సు లేకుండా విత్తనాలు,ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రసీదు ఇవ్వనిపక్షంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీలో మండల వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, రెంజల్ ఎస్సై సాయన్న ఉన్నారు.